క్లుప్తంగా

డిప్యూటీ సీఎం పరామర్శ



చరణ్‌రెడ్డి దంపతులతో నారాయణస్వామి

కాణిపాకం(యాదమరి): ఐరాల మండలం అగరంపల్లెలో వైఎస్సార్‌సీపీ పూతలపట్టు నియోజకవర్గ బూత్ కన్వీనర్ చరణ్‌రెడ్డిని డిప్యూటీ సీఎం నారాయణస్వామి సోమవారం పరామర్శించారు. చరణ్‌రెడ్డి కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతుండడంతో ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు.

రంజింపజేసిన అర్జున తపస్సు



హాజరైన భక్తులు

చిత్తూరు రూరల్: మహాభారత ఉత్సవాల్లో భాగంగా నగర పరిధిలోని బండపల్లిలో సోమవారం నిర్వహించిన అర్జున తప్పస్సు రంజింపజేసింది. ఈ సందర్భంగా గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివార్లను గ్రామ వీధుల్లో ఊరేగించారు.

ధ్యానంతో మానసిక ఉల్లాసం



ధ్యానంపై అవగాహన కల్పిస్తున్న మాస్టర్ నాగశ్రీ

పెనుమూరు (చిత్తూరు అగ్రికల్చర్): ధ్యానంతో మానసిక ఉల్లాసం పొందవచ్చని నరసాపురానికి చెందిన ధ్యాన పిరమిడ్ మాస్టర్ నాగశ్రీ అన్నారు. సోమవారం స్థానిక ముత్తుమారెమ్మ ఆలయ ఆవరణలో సాయి ధ్యాన పిరమిడ్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఒక్కరూ ధ్యానాన్ని అలవర్చుకోవాలన్నారు. నిత్యం ధ్యానం చేయడం వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం సిద్ధిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో పీపీఎస్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

బదిలీ ఎస్‌ఐకి సన్మానం



ఎస్‌ఐను సన్మానిస్తున్న సీఐ నరసింహారెడ్డి

బంగారుపాళెం: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న మల్లికార్జున్‌రెడ్డి అన్నమయ్య జిల్లా లక్కిరెడ్డిపల్లెకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆదివారం రాత్రి సీఐ నరసింహారెడ్డి, సిబ్బంది ఆయన్ను ఘనంగా సన్మానించారు. ఆయన సేవలను కొనియాడారు.

ప్రభుత్వబడి.. భవితకు ఒడి



విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ చేస్తున్న ఉపాధ్యాయులు

- విస్తృతంగా ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయులు
- బడిబయట విద్యార్థుల గుర్తింపు
- తల్లిదండ్రులకు కౌన్సిలింగ్

గుడిపాల: ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల ప్రచారానికి దీటుగా ప్రభుత్వ ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చిన్నారులను చేర్పిస్తే భవిష్యత్ బాగుంటుందని వివరిస్తున్నారు. బడిబయట పిల్లలను గుర్తించి వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ కూడా ఇస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో వచ్చిన ఫలితాలు, ఆయా పాఠశాలల్లో చదివి ప్రయోజకులైన విద్యార్థుల గురించి ప్రచారం చేస్తున్నారు. మండలంలో ఉపాధ్యాయుల కృషి సత్ఫలితాలను ఇవ్వడంతో పాఠశాలల్లో విద్యార్థుల చేరిక క్రమంగా పెరుగుతోంది.

సౌకర్యాలపై ప్రచారం

ఎంఈఓ రామ్‌నాయక్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు వారం రోజులుగా ప్రభుత్వ పాఠశాలలపై ప్రచారం చేస్తున్నారు. ప్రత్యేకంగా ప్రచురించిన కరపత్రాలతో ఇంటింటికి వెళుతున్నారు. అన్ని పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమాన్ని బోధిస్తున్నట్లు.. విద్యార్థులను స్కూళ్లలో చేర్పించాలని తల్లిదండ్రులను కోరుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోని సౌకర్యాలను వివరిస్తున్నారు. పాఠశాల తెరిచే రోజునే జగనన్న విద్యాకానుక అందజేస్తామని చెబుతున్నారు. నాడు–నేడు ద్వారా పాఠశాలల అభివృద్ధిని వివరిస్తున్నారు. అలాగే జగనన్న గోరుముద్ద ద్వారా ప్రతి రోజూ ఒక్కో మెనూతో విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందిస్తున్నట్లు అవగాహన కల్పిస్తున్నారు.

గత ఏడాది గుడిపాల మండలంలో ప్రభుత్వ విద్యార్థుల సంఖ్య

తరగతి	విద్యార్థుల సంఖ్య
1	226
2	258
3	224
4	276
5	274
6	262
7	297
8	274
9	279
10	293

బడిబయట పిల్లల గుర్తింపు:

మండలంలో బడిబయట ఉన్న పిల్లలపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ఎక్కడైనా అలాంటి వారు కనిపిస్తే పేర్లను నమోదు చేసుకుని తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇస్తున్నారు. ఉపాధ్యాయులు ప్రతి గ్రామంలో సర్వే చేపట్టగా బడిబయట పిల్లలు 22 మంది ఉన్నట్లు గుర్తించారు. వీరిలో 10మందిని పాఠశాలల్లో చేర్పించారు.

మూడు పాఠశాలల్లో 95 శాతం ఫలితాలు

ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థుల ప్రతిభ గురించి తెలియజేస్తున్నాం. ఈ ఏడాది పదో తరగతిలో ఏఎల్‌పురం, బొమ్మసముద్రం, కమ్మతిమ్మాపల్లె హైస్కూల్లో 95 శాతం ఫలితాలు వచ్చాయి. నరహరిపేట, చిత్తపార, శ్రీరంగంపల్లెలో సుమారు 65శాతం వచ్చింది. ఈ ఏడాది నుంచి మరింత మెరుగ్గా విద్యాబోధన అందించేందుకు కృషి చేస్తున్నాం.

–రామ్‌నాయక్, ఎంఈఓ, గుడిపాల



పేదల సంక్షేమానికి పెద్దపీట



మొగిలిలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

- పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

బంగారుపాళెం: పేదల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారని, వారి ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. సోమవారం మొగిలి గ్రామ సచివాలయం పరిధిలోని మొగిలి, గౌరీశంకరపురం, లక్ష్మీపురం గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలు తీరుపై ఆరా తీస్తూ..సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పలువురు ఇళ్ల స్థలాలు, రేషన్ కార్డులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఆధార్‌కార్డుల్లో తప్పుడు డేట్ ఆఫ్ బర్త్ కారణంగా అర్హత కలిగిన వృద్ధులకు పింఛన్లు మంజూరు కావడంలేదన్నారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యలు ఆయా శాఖల అధికారులు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తోందని తెలిపారు. అర్హత ఉండి ఇంకా ఎవరికైన పథకాలు అందకపోతే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

ఫ్యాక్టరీ కాలుష్యంపై చర్యలు తీసుకోండి

ఫ్యాక్టరీ నుంచి వెలువడే కాలుష్యంతో ఇబ్బందులు పడుతున్నామని గౌరీశంకరపురం గ్రామస్తులు ఎమ్మెల్యేకు తెలిపారు. తమ గ్రామానికి సమీపంలోనే నూడిల్స్ ఫ్యాక్టరీ ఉందన్నారు. ఫ్యాక్టరీ పొగగొట్టం ద్వారా వెలువడే బూడిద గ్రామంలోని ఇళ్లు, పంటలపైన పడడం వల్ల ఇబ్బందులు పడుతున్నామన్నారు. వ్యర్థజలాల కారణంగా బోరు బావుల్లో నీరు సైతం కలుషితం అవుతోందన్నారు. సమస్యపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహామండలి ఛైర్మన్ రామచంద్రారెడ్డి, ఎంపీపీ అమరావతి, జెడ్పీటీసీ సోమశేఖర్, స్థానిక సర్పంచ్ మనోహరి, ఎంపీటీసీ శ్యామల, కురబ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ అమరనాథ్, జిల్లా సేవాదల్ అధ్యక్షుడు కిషోర్‌రెడ్డి, నాయకులు రాజశేఖర్, దొరస్వామి, మహేంద్ర, చంద్రశేఖర్‌రెడ్డి వెంకటస్వామి, త్యాగరాజులు, ప్రభాకర్‌రెడ్డి, నాగేంద్రరెడ్డి, మునేంద్ర, బాలాజీ, ఇదయతుల్లా తదితరులు పాల్గొన్నారు.

నేడు గాండ్లపపల్లెలో..

మొగిలి సచివాలయం పరిధిలోని గాండ్లపల్లె, మొగిలిమిట్టూరు గ్రామాల్లో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఉదయం 7 గంటలకు కార్యక్రమం ప్రారంభం అవుతుందన్నారు.

ప్రతి ఇంటికీ వైద్య సేవలు



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

ఐరాల: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో ప్రతి ఇంటికీ వైద్య సేవలు అందించడమే లక్ష్యమని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. సోమవారం 35 యర్లంపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వైద్య శిబిరంలో 70 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఇళ్లకే పరిమితమైన రోగుల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని సూచనలు, సలహాలు ఇచ్చారు. సీహెచ్ఓ సుగుణవతి, హెల్త్ సూపర్‌వైజర్ శంకరమ్మ పాల్గొన్నారు.

వలంటీర్లకు సన్మానం



సన్మానం అందుకున్న వలంటీర్లు

పూతలపట్టు: మండలంలోని బైటపల్లి పంచాయతీ పరిధిలో పనిచేస్తున్న ఏడుగురు వలంటీర్లను సోమవారం సన్మానించారు. సర్పంచ్ రామతులసి మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలను అర్హులందరికీ చేరవేసి వారి మన్ననలు పొందాలని సూచించారు. స్థానిక సమస్యలను తెలుసుకుని ఎప్పటికప్పుడు ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. పంచాయతీ కార్యదర్శి మధు, వైస్ సర్పంచ్ చంద్రరెడ్డి, బాలాజీ పాల్గొన్నారు.

జేసీకి జన్మదిన శుభాకాంక్షలు



జేసీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న వీఆర్వో సంఘం నాయకులు

చిత్తూరు కలెక్టరేట్: జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు పుట్టిన రోజును పురస్కరించుకుని సోమవారం జిల్లా వీఆర్వో సంఘం నాయకులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. జేసీని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో వీఆర్వో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బాలాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి పద్మనాభం, అసోసియేట్ అధ్యక్షుడు హనుమంతు, డివిజన్ అధ్యక్షుడు మార్కొండయ్య పాల్గొన్నారు.

అతిసారపై అప్రమత్తత అవసరం



కీనాటంపల్లెలో అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

యాదమరి: చిన్నారులకు వచ్చే అతిసార(డయేరియా) వ్యాధిపై అప్రమత్తత అవసరమని సంతగేటు ప్రభుత్వాస్పత్రి వైద్యులు సూచించారు. మండలంలోని కీనాటంపల్లె ఆరోగ్య ఉపకేంద్రంలో అతిసారపై సీహెచ్ఓ లక్ష్మీనారాయణ అవగాహన కల్పించారు. ఐదేళ్లలోపు చిన్నారులకు విరేచనాలు అయితే సత్వరం వైద్య సిబ్బందిని సంప్రదించాలన్నారు.

'స్పందన' వినతులకు సత్వర పరిష్కారం

చిత్తూరు అర్బన్: 'స్పందన' కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చే వినతులను సకాలంలో పరిష్కరించాలని నగర కమిషనర్ జె.అరుణ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కమిషనర్ మాట్లాడుతూ.. స్పందన వినతులపై సంబంధిత విభాగాల అధికారులు క్షేత్రస్థాయి కి వెళ్లి పరిశీలించాలన్నారు. వినతులను పరిష్కరించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. గతవారం అందిన వినుతులపై సమీక్షించారు. ప్రజారోగ్య విభాగం 2, ఇంజినీరింగ్ 1, మెప్మా 1 చొప్పున మొత్తం 4 వినతులు అందాయి. సహాయ కమిషనర్ గోవర్ధన్, ఎంహెచ్ఓ లోకేష్ పాల్గొన్నారు.

మున్సిపల్ ఇంజినీర్‌గా వెంకటప్రసాద్

చిత్తూర్ అర్బన్: చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ ఇన్‌చార్జ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పి.వెంకటప్రసాద్‌కు పూర్తి బాధ్యతలు అప్పగిస్తూ కమిషనర్ అరుణ ఆదేశాలు జారీ చేశారు. ఇక్కడ పని చేస్తున్న ధనలక్ష్మిని టిడ్కో రాష్ట్ర కార్యాలయానికి బదిలీ చేస్తూ ఇటీవల ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసిన విషయం తెలిసిందే. సోమవారం వెంకటప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చిత్తూరు కార్పొరేషన్: నగరంలోని మురకంబట్టులో మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఈఈ పద్మనాభ పిళ్లై తెలిపారు. ఇక్కడ 11 కేవీ లైన్ పనులు జరుగుతున్నాయని చెప్పారు. దీని కారణంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేనూ ఊగుతా..



ఊయ్యాలలో ఊగుతున్న వానరం

బంగారుపాళెం: వేసవి కావడంలో ఇంటిముందు చింతచెట్టుకు ఉయ్యాల కట్టి చిన్నపిల్లలు ఆడుకుంటున్నారు. కొంతసేపటికి పిల్లలు అక్కడి నుంచి వెళ్లిపోయారు. చింతచెట్టుపై ఉన్న ఓ వానరం పిల్లలు కట్టుకున్న ఊయ్యాలలో కూర్చుని ఊయ్యాల ఊగింది. ఈ ఆసక్తకరమైన సంఘటన సోమవారం సాయంత్రం మండలంలోని మొగిలి గ్రామంలో చోటుచేసుంది. కోతి ఊయాల ఊగడంతో ఆసక్తిగా తిలకించారు.

ఎంపీ మిథున్‌రెడ్డికి ఘన స్వాగతం



ఎంపీ మిథున్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

యాదమరి(పూతలపట్టు): పూతలపట్టు నియోజకవర్గ పర్యటనకు వచ్చిన రాజంపేట ఎంపీ పీవీ మిథున్ రెడ్డికి సోమవారం వైఎస్సార్‌సీపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. పూతలపట్టు మండలం రంగంపేట క్రాస్ రోడ్డు, కాణిపాకం క్రాస్‌లో ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, బీఎంఆర్ సంస్థల అధినేత మోహన్ రెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయ రెడ్డి గజమాలలు వేసి స్వాగతం పలికారు. నాయకులు శ్రీకాంత్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, బుజ్జిరెడ్డి, కాణిపాక ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశు ఉన్నారు.

ఘనంగా రాజా మహల్ ప్రారంభోత్సవం



ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

చిత్తూరు రూరల్: నగరంలో సోమవారం రాజా మహల్ (రూమ్స్ అండ్ బ్యాంక్వెట్ హాల్) ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్సీ భరత్, మేయర్ అముద రిబ్బన్ కట్ చేసి మహల్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్, జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయరెడ్డి, రమ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ రాహుల్ రాజారెడ్డి పాల్గొన్నారు.

1,644 మంది రైతులకు టోకెన్లు



చెర్లోపల్లె ఆర్‌బీకే వద్ద టోకెన్ల కోసం వేచి ఉన్న రైతులు

తవణంపల్లె: మండలంలోని 17 రైతు భరోసా కేంద్రాల్లో 1644 మంది రైతులకు వేరుశనగ విత్తనాల కోసం ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసి టోకెన్లు ఇచ్చినట్లు మండల వ్యవసాయాధికారి ప్రవీణ్ తెలిపారు. మండలానికి 1,620 క్వింటాళ్ల విత్తనాలు వచ్చినట్లు చెప్పారు. సోమవారం వరకు 1644 మంది రైతులకు 677 క్వింటాళ్ల విత్తనాల పంపిణీకి టోకెన్లు ఇచ్చామన్నారు.

కమనీయం ద్రౌపదీ కల్యాణం



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

వెదురుకుప్పం: మండలంలోని చవటగుంట ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో జరుగుతున్న మహాభారత ఉత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవారి కల్యాణోత్సవం కనులపండువగా నిర్వహించారు. ఉదయాన్నే అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భాగవతారిణి నాగరత్న హరికథ కాలక్షేపం సాగింది. సాయంత్రం ఆలయం ఆవరణలో పెళ్లిపందిరి ఏర్పాటు చేసి ఉత్సవమూర్తులను వేంచేపు చేశారు. పట్టుపీతాంబరాలు, సుగంధపరిమళాలతో ముస్తాబు చేశారు. మేళతాళాలు మంగళవాయిద్యాల నడుమ శాస్త్రోక్తంగా మాంగల్యధారణ చేశారు. చుటు పక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మొక్క నాటుతున్న నగర మేయర్ అముద, ఎమ్మెల్యే శ్రీనివాసులు

చిత్తూరు అర్బన్: మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని నగర మేయర్ అముద అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరపాలక కార్యాలయం ఆధ్వర్యంలో సోమవారం కట్టమంచి చెరువు వద్ద మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. మేయర్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలన్నారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ.. విరివిగా మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించాలని చెప్పారు. కార్యక్రమంలో చుడా చైర్మన్ పురుషోత్తం రెడ్డి, కట్టమంచి శివారెడ్డి, కార్పొరేటర్‌లు హరిణి, జ్ఞానజగదీశ్ పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షిదాం

చిత్తూరు రూరల్: మొక్కలు నాటి వాటిని సంరక్షిద్దామని డీఐఓ రవిరాజు అన్నారు. నగరంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం ఆవరణంలో మొక్కలు నాటారు. అనంతరం ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. డీపీఎంఓ శ్రీనివాసరావ్, ఆర్‌బీఎస్‌కే కోఆర్డినేటర్ సుదర్శన్, అధికారులు గుణశేఖర్, శ్రీవాణి పాల్గొన్నారు.

అరగొండలో అవగాహన ర్యాలీ

తవణంపల్లె: మండలంలోని అరగొండ అపోలో నర్సింగ్ కాలేజీ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని, పర్యావరణాన్ని కాపాడాలని ర్యాలీ చేశారు. అనంతరం అరగొండ కొత్త బస్టాండ్ వద్ద మానవహారం నిర్వహించి పర్యావరణం గురించి వివరించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ శోభారాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం

గుడిపాల: పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని వసంతాపురం సర్పంచ్ రజనీకాంత్ అన్నారు. వసంతాపురం సచివాలయం ఆవరణలో మొక్కలు నాటారు.



జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో..



అరగొండలో విద్యార్థుల మానవహారం

తరగతులు ప్రారంభం



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ రమేష్‌బాబు

యాదమరి: స్థానిక కాశిరాళ్ల ఉన్నత పాఠశాల ఆవరణలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో సోమవారం నుంచి తరగతులు ప్రారంభమయ్యాయి. ప్రిన్సిపాల్ రమేష్‌బాబు ఆధ్వర్యంలో సరస్వతి పూజ నిర్వహించారు. పాఠశాల, కళాశాలలో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. అధ్యాపకులు కనకాచ్చారి, మదన్‌మోహన్ రెడ్డి, పద్మ, దామోదరరెడ్డి పాల్గొన్నారు.